క్లుప్తంగా

అన్నదానం

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని బాపూనగర్ శారదా గణేశ్ మండలి వద్ద శనివారం అన్నదానం నిర్వహించారు. దుర్గా నవరాత్రుల సందర్భంగా మండలి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు మహిళలు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షే గురుకుల పాఠశాలకు చెందిన చైతన్య, అజయ్‌లు జాతీయస్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ రహీం శనివారం తెలిపారు. గత నెల సిరిసిల్లలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి ఈనెల 6 నుంచి 10వరకు ఆంధ్రలో నంధ్యాల కర్నూర్ జిల్లాలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికై నట్లు తెలిపారు. జాతీయస్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.

రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక


ఎంపికైన గురుకుల పాఠశాల విద్యార్థులు

రెబ్బెన: మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ రమాదేవి తెలిపారు. సంకీర్తన, గాయత్రి, నవ్య రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నట్లు పేర్కొన్నారు. ఈనెల 6, 7న జరగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. క్రీడాకారులను వైస్ ప్రిన్సిపాల్ రజిత, పాఠశాల పీఈటీ రజిత, పీడీ స్వరూప, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రశాంతంగా ఉత్సవాలు జరుపుకోవాలి


మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్‌రావు

కాగజ్‌నగర్ రూరల్: దేవీ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని కాగజ్‌నగర్ రూరల్ సీఐ కె. శ్రీనివాస్‌రావు అన్నారు. శనివారం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో దుర్గామాత మండపాల నిర్వాహకులతో మాట్లాడారు. మండపాల వద్ద వలంటీర్లను నియమించాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కొత్త వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రూరల్‌ఎస్సై మహేందర్, ఈజీగాం ఎస్సై రాన్‌కుమార్, మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

మ్యూజియం ఏర్పాటు హర్షణీయం

నార్నూర్: మహారాష్ట్రలోని బంజారా కాశీ పొరాదేవి పుణ్యక్షేత్రంలో నంగారా మ్యూజియంను కేంద్ర ప్రభుత్వం రూ. 500 కోట్లతో నిర్మించడం హర్షణీయమని బంజారాసేవా సంఘం జిల్లా అధ్యక్షుడు జాదవ్‌రెడ్డి నాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని గాంధీచౌక్ వద్ద ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. బంజారా సమాజం సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా మ్యూజియం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బానోత్ గజానంద్‌నాయక్, రాథోడ్ ఉత్తం పాల్గొన్నారు.

పొగాకు రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలి

ఎదులాపురం: పొగాకు రహిత సమాజ నిర్మాణానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని జిల్లా పొగకు నియంత్రణ విభాగం సైకాలజిస్ట్ శ్రీకాంత్ అన్నారు. శనివారం పట్టణంలోని పలు దుకాణాల యజమానులకు అవగాహన కల్పించారు. యువత పొగాకు ఉత్పత్తులకు ఎక్కువగా అలవాటు పడుతున్నారని, పొగాకు ఉత్పత్తుల వాడకం వలన కలిగే అనర్థాలను యువతకు వివరించాలన్నారు. సిగరెట్లు తాగడం, గుట్కా, ఖైని, అంబర్ లాంటి పదార్థాలు వాడటం వలన నోటి కాన్సర్, ఇతర సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. పిల్లలు పొగాకు ఉత్పత్తులు వాడినట్లు గుర్తిస్తే తల్లిదండ్రులు వెంటనే దగ్గరలోని మానసిక నిపుణుల వద్దకు తీసుకువెళ్లాలని కోరారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్లు వెంకట రమణ, శ్రీనివాస్, చిరంజీవి, పాల్గొన్నారు.

అసౌకర్యాల సంత

- చినుకు పడితే చిత్తడిగా వారసంత
- షెడ్లు లేక కవర్లతోనే గుడారాలు
- ఇబ్బంది పడుతున్న వ్యాపారులు


రోడ్డుపైనే నిలిపిన వాహనాలు


వర్షానికి చిత్తడిగా మారిన వారసంత (ఫైల్)

వాంకిడి: మండల కేంద్రంలోని చిక్లీ వాగు తీరంలో ప్రతీ గురువారం నిర్వహించే వారసంత అసౌకర్యాలతో కొట్టుమిట్టాడుతోంది. ప్రతీ ఏడాది సంత నిర్వహణను వేలం వేసి ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తున్నారు. వేలం ద్వారా లక్షల రూపాయలు గ్రామ పంచాయతీకి సమకూరుతున్నప్పటికీ సంత నిర్వహించే ప్రాంతంలో మాత్రం సౌకర్యాలు కల్పించడం లేదు. దీంతో వ్యాపారులు, ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఎప్పుడో కొన్ని దశాబ్దాల క్రితం నిర్మించిన షెడ్లు నామరూపాలు లేకుండా పోయాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు సంత ప్రాంతంలో హైమాస్ట్ లైట్స్ తప్పా.. ఎలాంటి సౌకర్యాలు కల్పించలేదు.

ఆదాయం ఉన్నా..

మండల కేంద్రంలో నిర్వహించే సంతలో మహారాష్ట్ర నుంచి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వందల మంది వ్యాపారులు, కూరగాయలు అమ్ముకునే రైతులు వస్తుంటారు. కొనుగోలుదారులు సైతం అదేస్థాయిలో వస్తారు. ప్రతీ గురువారం లక్షల రూపాయల వ్యాపారం జరుగుతుంది. కానీ సౌకర్యాలు లేమితో వ్యాపారులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వర్షాలు కురిసినప్పుడు సంత చిత్తడిగా మారి అధ్వానంగా మారుతోంది. వ్యాపారులు బురదలోనే గుడారాలు ఏర్పాటు చేసుకొని ఇబ్బందుల మధ్య కాలం వెళ్లదీస్తున్నారు. వాహనాలతో వచ్చే వారు పార్కింగ్ కోసం ప్రత్యేకించి స్థలం కేటాయించకపోవడంతో రోడ్డుపైనే నిలుపుతున్నారు. సంతలో అన్ని సౌకర్యాలు కల్పించేందుకు విశాలమైన స్థలం ఉన్నప్పటికీ పంచాయతీ అధికారులు మాత్రం దృష్టి సారించడం లేదని స్థానిక ప్రజలు విమర్శిస్తున్నారు. గత మూడు సంవత్సరాల నుంచి సుమారుగా 2022లో వేలం పాట ద్వారా రూ.6 లక్షలు, 2023లో రూ.9 లక్షలు, 2024లో 9 రూ.4.75 లక్షల నిధులు గ్రామ పంచాయతీకి సమకూరాయి. నిధులకు అనుగుణంగా సౌకర్యాల కల్పనపై దృష్టి సారిస్తే బాగుంటుందని మండల వాసులు కోరుతున్నారు.

సంత అభివృద్ధికి నిధులు కేటాయించాలి



ప్రతీ ఏడాది సంత నిర్వహణకు లక్షల రూపాయలు గ్రామ పంచాయతీకి సమకూరుతాయి. అయినా సంతలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టడం లేదు. కనీస వసతులు కల్పించడంలో పంచాయతీ అధికారులు విఫలమవుతున్నారు. ఇప్పటికైనా వేలం పాట ద్వారా సమకూరే నిధులను సంత అభివృద్ధికి వినియోగించాలి.

– ఎలగతి సుచిత్, వాంకిడి

వెంకటస్వామికి ఘన నివాళి



నివాళులర్పిస్తున్న జీఎం శ్రీనివాస్

రెబ్బెన: గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో శనివారం సింగరేణి ఆధ్వర్యంలో దివంగత మాజీ కేంద్ర మంత్రి గడ్డం వెంకటస్వామి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఏరియా జీఎం శ్రీనివాస్‌తో పాటు ఇతర విభాగాల అధికారులు వెంకటస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేంద్ర మంత్రిగా, పెద్దపెల్లి పార్లమెంట్ సభ్యుడిగా నిరుపేద కోసం ఆయన చేసిన సేవలు ఎప్పటికీ నిలిచి ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఎస్‌వోటూజీఎం రాజమల్లు, ఏరియా ఇంజనీరు భీంరావు జాడే, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, ఏఐటీయూసీ నాయకులు బయ్య మొగిళి, ఐఎన్‌టీయూసీ నాయకులు పేరం శ్రీనివాస్, సీనియర్ పర్సనల్ అధికారి ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దుర్గామాతకు పూజలు


కూరగాయలతో అలంకరించిన భక్తులు

కాగజ్‌నగర్ రూరల్: శరన్నవరాత్రులను పురస్కరించుకుని కాగజ్‌నగర్ పట్టణంలోని భక్తులు భక్తిశ్రద్ధలతో దుర్గామాతను కొలుస్తున్నారు. మూడో రోజు అన్నపూర్ణ దేవీ అలంకరణలో దర్శనమిచ్చింది. పట్టణంలోని కాపువాడలో గల భజరంగ్‌దళ్, సాయి దుర్గామండలి ఆధ్వర్యంలో దుర్గామాతను కూరగాయలతో అలంకరించారు. పలు మండపాల వద్ద అన్నదానం నిర్వహించారు.

తిర్యాణి: మండలంలోని తలండి హనుమాన్ ఆలయంలో మాల మహనాడు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపం వద్ద శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పులి రతిశ్, సంతోశ్, సాయిరాం, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి


కార్యాలయం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

కాగజ్‌నగర్ రూరల్: అటవీ అభివృద్ధి సంస్థ (ఎఫ్‌డీసీ) ఆధ్వర్యంలో ప్లాంటేషన్లు పెంచి పర్యావరణ పరిరక్షణకు పాటుపడుతున్నారని ఎమ్మెల్యే హరీశ్‌బాబు అన్నారు. శనివారం పట్టణంలోని బస్టాండ్ ఏరియాలో నూతన ఎఫ్‌డీసీ డివిజనల్ మేనేజర్ కార్యాలయాన్ని ఎఫ్‌డీసీ చైర్మన్ పోడెం వీరయ్యతో కలిసి ప్రారంభించారు. ఏకో టూరిజం ప్రాజెక్టుల కింద నియోజకవర్గంలోని పలు ప్రాంతాలను ఎంపిక చేయాలని కోరారు. అనంతరం ఎఫ్‌డీసీ వీరయ్య మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు.

భీం వర్ధంతి విజయవంతం చేయండి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఉట్నూర్‌రూరల్: ఈనెల 17న ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలంలోని జోడేఘాట్‌లో నిర్వహించే కుమురం భీం వర్ధంతిని విజయవంతం చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. శనివారం ఉట్నూర్ మండలంలోని తన క్యాంపు కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు. జల్‌జంగల్ జమీన్ నినాదంతో నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. కుమురం భీం మనుమడు సోనేరావు, మాజీ సర్పంచ్ మర్సుకోల తిరుపతి, మంగి మాజీ సర్పంచ్ కోట్నాక్ గణపతి పాల్గొన్నారు.

బుద్ధిస్ట్ పర్సనల్ లా ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న మధు బావుల్కర్

ఆసిఫాబాద్: భారత బౌద్ధులకు ప్రత్యేక బుద్ధిస్ట్ పర్సనల్ లా ఏర్పాటు చేయాలని భారతీయ బౌద్ధ మహారాష్ట్ర కమిటీ ఆర్గనైజర్, బుద్ధిస్ట్ పర్సనల్ లా రాష్ట్ర అధ్యక్షుడు మధు బావుల్కర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని లుంబిని దీక్ష భూమి వద్ద శనివారం మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలోని అంబేద్కర్, బౌద్ధ సంఘాలు, రమాబాయి ఒక్కటై రాజ్యాంగంపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. బుద్ధగయ బౌద్ధ దేవాలయం విముక్తి ఉద్యమం ముందుకు తీసుపోవాలన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్ మాహోల్కర్, ప్రతినిధులు విస్తారు, వినేశ్, తుకారాం, తిరుపతి, శ్యాంరావు, మనోహర్, బాపు, ఆత్మారాం, రమేశ్, ప్రేంకుమార్ పాల్గొన్నారు.

ఇబ్బందులు లేకుండా సోయా కొనుగోలు చేయాలి


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఇచ్చోడ: రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సోయా కొనుగోళ్లు చేపట్టాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో సోయా కొనుగోళ్ల కేంద్రాన్ని ప్రారంభించారు. బీఆర్‌ఎస్ హయాంలో రైతు అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులను ఆదుకునే వారే కరువయ్యారని ఆరోపించారు. సోయా కొనుగోళ్ల కేంద్రాల్లో ఎలాంటి అవకతవకలు లేకుండా చూడాలన్నారు. దళారులు వద్ద కానీ మహారాష్ట్ర నుంచి వచ్చే సోయాలను కొనుగోళ్లు చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి గజానంద్, డీసీవో మోహన్, మార్కెట్ కార్యదర్శి రమేశ్, సహకార సంఘం సీఈవో ఈశ్వర్, చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం 44వ జాతీయ రాహదారి గాంధీనగర్ నుంచి కామాగిరి వరకు కోటి 80 లక్షలతో నిర్మించనున్న బీటీ రిన్యూవల్ పనులకు భూమిపూజ చేశారు.

కాంగ్రెస్‌లో చేరిక


పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సమక్షంలో లక్కారం మాజీ సరచ్ మర్సుకోల తిరుపతి, ఆయన సతీమణితో పాటు పలువురు బీఆర్‌ఎస్ కార్యకర్తలు శనివారం కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్‌ఎస్ నుంచి 250 మంది కాంగ్రెస్‌లో చేరారన్నారు. పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమన్నారు.

సివిల్ సప్లై కార్మికుల సంబురాలు


స్వీట్లు పంచుకుంటున్న కార్మికులు

ఇచ్చోడ: సివిల్ సప్లై కార్మికుల సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వం ఆమోదం తెలపడంతో శనివారం మండల కేంద్రంలోని గోదాం వద్ద సివిల్ సప్లై కార్మికులు సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా సహయ కార్యదర్శి కల్లెపల్లి గంగయ్య మాట్లాడారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేసిన పోరాటం ఫలితంగా సివిల్ సప్లై గోదాంలలో పనిచేసే కార్మికుల సమస్యల పరిష్కరించిందన్నారు. పోరాటాల ద్వారా కార్మికుల సమస్యలు పరిష్కరించుకోవచ్చునని అన్నారు. కార్యక్రమంలో కార్మికులు శంకర్, రాజేందర్, నరేశ్, వన్నెల లక్ష్మణ్, సాయికుమార్, నరేశ్, వెంకటేశ్, రాజేందర్ పాల్గొన్నారు.

స్వచ్ఛతలో మొదటి స్థానంలో నిలపాలి


పిచ్చిమొక్కలు తొలగిస్తున్న జీఎం శ్రీనివాస్

రెబ్బెన: స్వచ్ఛత కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేసి స్వచ్ఛతలో ఏరియాను మొదటి స్థానంలో నిలపాలని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ శ్రీనివాస్ అన్నారు. స్వచ్ఛత పఖ్వాడా (స్పెషల్ కాంపెయిన్ 4.0) కార్యక్రమంలో భాగంగా శనివారం గోలేటి లోని శ్రీభీమన్న స్టేడియంలో పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలు, చెత్తాచెదారం తొలగించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ రోజులో ఒక గంట స్వచ్ఛత కోసం కేటాయించాలన్నారు. స్టేడియంలో వాకింగ్ ట్రాక్ వెంట ఉన్న పిచ్చిమొక్కలను తొలగించి సుందరంగా తీర్చిదిద్దాలని సివిల్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి ఉపాధ్యక్షుడు బయ్య మొగిళి, ఎస్‌వోటూజీఎం రాజమల్లు, డీజీఎం ఐఈడీ ఉజ్వల్‌కుమార్ బెహారా, మదీనా భాషా, రమేశ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

విజయదశమి ఏర్పాట్లపై సమావేశం


పాల్గొన్న ఆలయ కమిటీ ప్రతినిధులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ ఆంజనేయస్వామి ఆలయంలో ఈనెల 12న నిర్వహించే విజయ దశమి ఉత్సవాలు పకడ్బందీగా చేపట్టాలని ఆలయ కమిటీ సభ్యులు నిర్ణయించారు. శనివారం ఆలయంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ధర్మపురి వెంకటేశ్వర్లు, గుండ వెంకన్న మాట్లాడుతూ విజయదశమి సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, సాయంత్రం శమీ వృక్ష పూజ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కమిటీ ప్రతినిధులు పిన్న వివేక్, గడ్డల వెంకటేశం, ఎకిరాల శ్రీనివాస్, చిలుకూరి రాధాకృష్ణ, ఇరుకుల్ల సుధాకర్, రమేశ్, వనం మధుకర్, రావుల నారాయణమూర్తి, సాయిని లక్ష్మణమూర్తి పాల్గొన్నారు.

హక్కుల సాధన కోసం ఉద్యమించాలి


మాట్లాడుతున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: అరె కుల హక్కుల సాధన కోసం ఉద్యమించాలని అరె సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు జయరాం అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో అరె సంక్షేమ సంఘం భవనంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అరె కులస్తులకు ఈడబ్ల్యూఎస్ ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడంలో తహసీల్దార్‌లు ఇబ్బందికి గురి చేస్తున్నారని అన్నారు. ఎస్సీ, ఎస్టీ ఓబీసీ జాబితాలో లేని తమకు ఈడబ్ల్యూఎస్ జారీ చేయడంలో అలసత్వం వహించడం సరికాదన్నారు. ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో తమ కులానికి చెందిన అభ్యర్థులు ధ్రువపత్రాల పరిశీలన విషయంలో ఇబ్బంది చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాదారం, గౌరవ అధ్యక్షుడు వాసు పటేల్, తిరుపతి, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మలతో అధ్యాపకులు, విద్యార్థినులు



బతుకమ్మ సంబురాలు


అటవీశాఖ కార్యాలయంలో..

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో బతుకమ్మ సంబురాలు కొనసాగుతున్నాయి. శనివారం పట్టణంలోని వాసవీ మందిర్, బజార్‌వాడి, తారక రామానగర్‌తో పాటు పట్టణంలోని కాలనీల్లో మహిళలు బతుకమ్మ సంబురాలు జరుపుకుంటున్నారు. జూనియర్ ఫారెస్టు అసోసియేషన్ ఆసిఫాబాద్ డివిజన్ శాఖ అధ్యక్షుడు యోగేశ్ ఆధ్వర్యంలో అటవీశాఖ కార్యాలయంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారిణిలు సరోజారాణి, ఝాన్సీ, లక్ష్మి, సంఘం జాయింట్ సెక్రెటరీ స్వప్న, సిబ్బంది పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో శనివారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. బతుకమ్మ పండుగ సందర్భంగా విద్యార్థినిలు తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి ఆడిపాడారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ పండుగ అని ప్రిన్సిపాల్ అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

'మాదిగలకు అన్యాయం చేస్తున్న కాంగ్రెస్'


మాట్లాడుతున్న అరెల్లి మల్లేష్

ఇచ్చోడ: కాంగ్రెస్ ప్రభుత్వం మాదిగలకు అన్యాయం చేస్తోందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు అరెల్లి మల్లేష్ ఆరోపించారు. శుక్రవారం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న కుట్రలకు నిరసనగా ఈనెల 9న జిల్లా కేంద్రంలో నల్ల జెండాలతో భారీ ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ లేకుండానే కాంగ్రెస్ ప్రభుత్వం టీచర్ పోస్టులను భర్తీ చేయడం సరికాదన్నారు. మాల నాయకులు చేస్తున్న బ్లాక్ మెయిల్ రాజకీయాలకు భయపడవద్దన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు చిట్టి రవి, సిరిసిల్ల భూమయ్య, జనారపు సాయి, కాశిపాక విష్ణు, మచ్చ గంగయ్య, అన్నెల రమేశ్, పసుల శ్రీకాంత్, మచ్చ అజయ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి

ఆదిలాబాద్‌రూరల్: తక్షణమే ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని మాదిగ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గాలిపల్లి నాగన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో శనివారం మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీల ఏబీసీడీ వర్గీకరణపై అభిప్రాయాలు స్వీకరిస్తున్న నేపథ్యంలో తక్షణమే ఈ దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. మాదిగ ఉపకులాలకు విద్యా, ఉద్యోగ రంగాలలో న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. మాదిగ ఉపకులాల ప్రజలు మెయిల్స్, లెటర్స్ ద్వారా హైదరాబాదులోని దామోదర సంజీవయ్య భవన్ మాసబ్ ట్యాంక్ అడ్రస్‌కు అభిప్రాయాలు పంపించాలని కోరారు. కార్యక్రమంలో మనోజ్, రాందాస్, గంగాధర్, విలాస్, తదితరులు పాల్గొన్నారు.